ప్రజాశక్తి
శనివారం 18 ఫిబ్రవరి 2023
5
శ్రీ సత్యసాయి




కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం మొదటి రోజు పట్టభద్రుల నియోజకవర్గానికి ఒకటి, ఉపాధ్యాయుల నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలు అయ్యింది.కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు శుక్రవారం నాడు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గానికి గాను ఇండిపెండెంట్ అభ్యర్థులుగా టి.మల్లేష్ యాదవ్, వంకిరి రామచంద్రుడు, నాగస్వరం నరసింహం, పట్టు పోగుల పవన్ కుమార్, సల్కాపురం అమత్ కుమార్‌లు నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డి నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

హద్దుమీరిన 'ప్రతాప'ం

- ఎక్కడ ఎన్నికలున్నా అక్కడ ఇన్‌ఛార్జి
- అధికార మెప్పుకోసం ఆరాటం
- వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆ సీటు కొసమేనా ?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక అధికారులు అందుకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంలో ఎటువంటి అభ్యంతరాలేవీ ఉండవు. కాని అలా కాకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు మద్దతుగా అధికారిక హోదాలో ఉన్న వారు వ్యవహరించ కూడదు. కాని విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి మాత్రం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు ఎక్కడ జరిగితే అక్కడ ఇన్‌ఛార్జిగా వెళ్లటం అక్కడ అధికార పార్టీ మెప్పుకోసం తన 'ప్రతాప'ం చూపడం పరిపాటిగా మారుతూనే ఉంది. గతంలోనూ గుంటూరు-కృష్ణా జిల్లాలో ఎన్నికలు జరిగినప్పుడు ఆయన భార్య కల్పలతారెడ్డి ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనూ ఇన్‌ఛార్జిగా వెళ్లి ఓటర్లను ప్రభావితం చేసారన్న ఆరోపణలున్నాయి. ఇప్పుడు కూడా అదే తంతు అనంతపురం, కడప, కర్నూలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కన్పిస్తోంది.

మాట వినేవారినే నియమించి..

సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ శాసనమండలి ఎన్నికలను రాజకీయపార్టీలు ఎన్నికల రెఫరెండమ్‌గా భావిస్తున్నాయి. గత శాసనమండలి ఎన్నికల ఫలితాలను అదే రకంగా తీసుకున్నాయి. ఆ ఫలితాలు ఇప్పటి అధికార వైసిపికి అనుకూలంగా రావడం, ఆ తరువాత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపినే అధికారంలోకి వచ్చింది. ఇది చూసిన పార్టీలు ఈ ఎన్నికలు ప్రజల మూడ్‌ను తెలియజేసేవిగా భావిస్తుంటాయి. అందుకే మండలి ఎన్నికలను రాజకీయ పార్టీలు సీరియస్‌గా తీసుకుంటున్నాయి. ప్రధానంగా అధికార వైసిపి ఈ ఎన్నికలను మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు కనిపిస్తోంది. తమకున్న సర్వశక్తులనూ ఒడ్డేందుకు సిద్ధపడింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తీసుకుంటున్న చర్యలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఓటర్ల నమోదు సమయంలో అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించలేదని అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌ను బదిలీ చేశారు. ఆ తరువాత ఆర్జేడీ వెంకటప్రసాద్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. తరువాత ఆయన్ను తప్పించి గుంటూరు-కృష్ణ ఎన్నికల్లో తమకు అనుకూలంగా బాగా పనిచేసారని భావించిన ప్రతాప్‌రెడ్డి ఎస్‌పిసిఆర్ అడిషనల్ డైరెక్టర్‌గానున్న ఆయన్ను ఆర్జేడీ ఇన్‌ఛార్జిగా తీసుకొచ్చారు. ఆయన వచ్చినప్పటి నుంచే మూడు జిల్లాల్లో సొంత శాఖ పనుల కంటే ఎన్నికల పనులపైనే ఎక్కువగా దృష్టి సారించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక సమావేశాల్లోనూ ఆయన వ్యవహార శైలి అధికారపార్టీకి ప్రచారం చేసే విధంగా సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి. అది గురువారం అనంతపురం నగరంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలోనూ కనిపించింది. ఇక రాత్రికి స్వచ్ఛంద సంస్థ అతిథి గృహంలో వైసిపి ఉపాధ్యాయ అభ్యర్థి రామచంద్రారెడ్డితోపాటు, ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలతో కలిపి సమావేశం నిర్వహించడం, ఆ సమావేశంలోనే విందు, మందు కూడా ఉండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. విద్యార్థి సంఘాల ఆందోళనతో వెలుగులోకి వచ్చాక కూడా ఏకంగా పోలీసు అధికారినే బెదిరించడం ఆయన అధికార దర్పానికి అద్దం పడుతోంది.

ప్రతాప్‌రెడ్డిలో రాజకీయ వాసనలు

ఆర్జేడీగానున్న ప్రతాప్‌రెడ్డిలో రాజకీయ వాసనలున్నట్టు విద్యార్థి, యువజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. గత ఎన్నికల్లోనే వైసిపి తరుపున తమ కుటుంబ సభ్యులకు కదిరి నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించినట్టు రాజకీయవర్గాల్లోనూ చర్చ సాగుతోంది. ఇప్పుడు కూడా వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంటుగానీ, కదిరి అసెంబ్లీ నుంచిగాని తమ కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరికి టికెట్టు ఆశిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఆయన ఈ ఎన్నికల్లో పార్టీ పెద్దల మెప్పుకోసం బాహాటంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎన్నికల నోడల్ అధికారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ కొండయ్య

పక్కాగా ఎన్నికల నియమావళి

డిఆర్‌ఒ పి.కొండయ్య

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలని డిఆర్‌ఒ పి.కొండయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్లోని డిఆర్‌ఒ ఛాంబర్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల నేపథ్యంలో సంబంధిత నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. ఎన్నికల నియమావళి అమలుకు ప్రతి ఒక్క అధికారి కషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 21 మంది జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించామన్నారు. మార్చి 13వ తేదీన జరగనున్న ఎన్నికల కోసం జిల్లాలో 54 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ రోజున ఓటర్లు ప్రశాంతంగా, ప్రజాస్వామికంగా ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలు కల్పించాలన్నారు. అన్ని పార్టీల నేతలూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు సహకరించాలని కోరారు. ప్రశాంత ఎన్నికలు జరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కొడిగెనహళ్లి ఎపి ఆర్‌జెసి కళాశాలలో కుల కలకలం

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

ప్రజాశక్తి-పరిగి



పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే కులం పేరుతో దూషించడమే కాకుండా దళితుల వైఖరిపై వ్యంగ్యాస్త్రాలు సంధించి మాట్లాడడం కలకలం రేపింది. మండలంలోని కోడిగినహళ్లి ఎపి ఆర్‌జెసి కళాశాలలో ఎస్సీ ఉపాధ్యాయులు, విద్యార్థులపై కళాశాలకు చెందిన సుజాత అసభ్య పదజాలంతో మాట్లాడడమే కాకుండా ఎస్సీ విద్యార్థులు చదువులో వెనుకబడి ఉంటారని మాట్లాడినట్లు తోటి ఉపాధ్యాయురాలు సబితా రాణి ప్రిన్సిపల్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ నిర్వహించిన ప్రిన్సిపల్ సుజాతపై శుక్రవారం ఎపి ఆర్‌జెసి సెక్రటరీ ఫిర్యాదు చేయడం గమనార్హం. విషయం తెలుసుకున్న దళిత సంఘం నాయకులు కళాశాలకు చేరుకుని కుల దూషణకు పాల్పడిన ఉపాధ్యాయురాలిపై విచారించి చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేంద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎంఎస్ఎఫ్ రవి మాట్లాడుతూ సమాజం దినదినాభివృద్ధి చెందుతున్న సమయంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే కులాలుగా విభజించి వ్యంగా మాట్లాడటం హేయమైన చర్య అని మండిపడ్డారు. తక్షణమే సుజాత, ఆమెకు సహకరించిన శివారెడ్డి, చెన్నకేశవులుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కుల సంఘాల నాయకులు మద్దిలేటి, రమేష్, దళిత సమాఖ్య అధ్యక్షులు నారాయణ, మాజీ ఎంపిపి గోవిందప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదర్శ్, తదితరులు ఉన్నారు.

రీ సర్వే పనులను వేగవంతంగా చేపట్టాలి

జాయింట్ కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

జిల్లాలో చేపట్టిన జగనన్న భూహక్కు భూ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రీసర్వేపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, డిఐఒఎస్‌లు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేర్లు, విలేజ్ సర్వేర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎలాంటి తప్పులు జరగటానికి వీలులేదన్నారు. రీసర్వేపై ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలన్నారు. రీసర్వేలో భాగంగా గ్రౌండ్ టు థింక్ వేగంగా చేపట్టాలని గ్రౌండ్ వెలివేషన్ త్వరగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే రాళ్లను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. 29 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉండగా మూడు గ్రామాల్లో విడుదల చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో మార్చి నెలాఖరులోపు సకాలంలో నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రీసర్వేలో సమస్యలు తలెత్తితే అధికారులు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ, ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేంద్రనాయక్, రాఘవేంద్ర, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కొలతలతోపాటు కనీస వసతులు తప్పనిసరి

డివిజినల్ ఎఎస్ఒ ప్రభావతి

ప్రజాశక్తి-చిలమత్తూరు



పెట్రోల్ బంకులను పరిశీలిస్తున్న అధికారులు

పెట్రోల్ బంకుల్లో కొలతలు సక్రమంగా అమలు చేయడంతోపాటు కనీస వసతులైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సివిల్ సప్లయ్ డివిజినల్ ఎఎస్ఒ ప్రభావతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం సివిల్ సప్లయ్ తూనికలు, కొలతల అధికారులు సంయుక్తంగా మండలంలోని రెండు పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం కనీస వసతులు కల్పించాలన్నారు. కల్పించకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ శివశంకర్, డిప్యూటీ తహశీల్దార్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ



పుట్టపర్తి రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లాలోని ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు సుఖసంతోషాలతో శివరాత్రి పర్వదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా జాగరణ, శివపార్వతుల కల్యాణం, తదితర వేడుకల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా అల్లువారిపల్లి కాటి కోటేశ్వరస్వామి, హేమవతి మంజునాథస్వామి, మడకశిర చంద్రమౌళీశ్వరస్వామి, ఆగిలి శంకరేశ్వర, ధర్మవరం శ్రీ కాశీ విశ్వనాథస్వామి, సుంకేపల్లి వీరనారప్ప స్వామి, తిమ్మమ్మమర్రిమాను, నారాయణస్వామి ఆలయల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మొబైల్ సెక్యూరిటీ హ్యాండ్ హోల్డ్ డివైస్ (పాపిల్లాన్ మొబైల్ డివైస్) ద్వారా అనుమానితులను తనిఖీలు చేయలన్నారు.

తిమ్మమ్మమర్రిమానుకు ప్రత్యేక బస్సులు

కదిరి టౌన్ : మహాశివరాత్రి సందర్భంగా తిమ్మమ్మమర్రిమాను జాతరకు కదిరి డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కదిరి డిపో మేనేజరు బీడుపల్లి మైనుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18, 19న జరుగే జాగరణకు, మొక్కులు తీర్చుకునే భక్తుల సౌకర్యార్థం కదిరి డిపో నుంచి 30 నిమిషాలకు ఒక్క బస్సు చొప్పున 10 బస్సులను గాండ్లపెంట, రెక్కమాను మీదుగా నడుపనున్నట్లు తెలిపారు. కదిరి బస్టాండు నందు, జీవిమాను సర్కిల్ వద్ద, రెక్కమాను వద్ద, కొక్కంటి క్రాస్ వద్ద ప్రత్యేక శిబిరాలు వేసి, ప్రయాణికులకు వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే చిత్తూరు జిల్లా నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మొలకలచెరువు నుండి కొక్కంటి క్రాస్ ద్వారా మూడు ప్రత్యేక బస్సులు నడపనున్నటు తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముఖహాజరుకు ఆర్టీసీ ఉద్యోగులను మినహాయించాలి

కదిరి టౌన్ : విధి నిర్వహణలో పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం శ్రమిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుని విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేషియల్ యాప్ నుంచి పిటిడి ఉద్యోగులకు మినహాయింపు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సంస్థలో కండక్టర్లు, కానిస్టేబుళ్లు, శ్రామిక్‌లుగా పని చేస్తూ మృతిచెందిన వారి వారసులతో ఖాళీలు భర్తీ చేయాలని, ఓవర్ టైం, ఇతర అలవెన్స్‌లను ప్రతినెలా వేతనంలో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమును ఎపిపిటిడి ఉద్యోగులందరికీ అమలు చేయించాలని, ఇప్పటికీ ఆర్టీసీ ద్వారా జీతాలు తీసుకుంటున్న 2996 మందిని ట్రెజరీలోకి అనుమతించాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అధికార దుర్వినియోగం

- ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించాలి
- సిపిఎం, సిపిఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుకోసం విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగుతున్న ఈయన్ను తక్షణం విధుల నుంచి తప్పించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక గణేనాయక్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో సిపిఎం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అధికారిగా కాకుండా అధికార పార్టీ ఎన్నికల ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాత్రి సమయంలో ప్రయివేటు అతిథి గృహాల్లో వైసిపి ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డి సమక్షంలోనే ఉపాధ్యాయ సంఘాలు, ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలను పిలుచుకుని ఎన్నికల్లో ఎరవేసే ప్రయత్నాలు చేసారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రశ్నించడానికి వెళ్లిన విద్యార్థి సంఘం, యువజన సంఘం నాయకులపై బెదిరింపులకు దిగారని పేర్కొన్నారు. ఆర్‌జెడి అక్రమాలను ప్రశ్నించిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్టు చేసి రాప్తాడు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లేలా పోలీసుపై ఒత్తిడి చేశారన్నారు. అంతటితో ఆగని ఆర్‌జెడి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఏకంగా పోలీసు అధికారిని అందరి సమక్షంలోనే బెదిరించడం సిగ్గుచేటన్నారు. ఈ విషయాలన్నీ సిసి పుటేజీల్లో ఉన్నాయన్నారు. వీటిని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పైగా విద్యార్థి సంఘం నాయకులే ఆర్జేడీని హత్య చేయడానికి వచ్చారని బుకాయించే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. విద్యార్థి సంఘం నాయకులే మద్యం సేవించి వచ్చారని కూడా చెప్పారన్నారు. దీనిపై విచారణకు తాము సిద్ధమని, ఆర్జేడీ సిద్ధమా అని ప్రశ్నించారు. మద్యం మత్తులో కనీసం నిలబడలేని స్థితిలో ఆర్జేడీ రాత్రి ఉన్నారన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీకి పూర్తి అనుకూలంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయదలచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన ఆర్జేడీపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆ బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఇన్‌ఛార్జిగా వచ్చిన ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతు న్నారన్నారు. ఆయన తనకున్న అధికారంతో అటు ఉపాధ్యాయులను, ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలపై ఒత్తిడి పెంచి అధికార వైసిపికి శాసనమండలి ఎన్నికల్లో ప్రయోజనం చేకూర్చాలని చూడటం సరైంది కాదని మండిపడ్డారు. రాత్రి సమయంలో ఒక స్వచ్ఛంద సంస్థ అతిథి గృహంలో కొంత మందిని పిలిపించుకుని విందులివ్వడమే కాకుండా, డబ్బుల పంపిణీకి ఆయనే దగ్గరుండి ప్రణాళిక చేయడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అధికారపార్టీ అధికారుల ద్వారా అడ్డదారుల్లో పనులు చేయించుకుని ఎన్నికల్లో గెలవాలని చూడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. వామపక్షాలుగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగే విధంగా తాము కోరుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ పద్ధతులకు ఎవరైనే పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, నాగేంద్రకుమార్, సిపిఐ నాయకులు రమణయ్య పాల్గొన్నారు.

ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-పెనుకొండ



ఎమ్మెల్యే శంకరనారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

పారిశుధ్య కార్మికులకు ఫేస్‌యాప్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకరనారాయణను సిఐటియు నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల జీతాలు, ఉద్యోగాలకు ముప్పు తెచిపెట్టేలా ఉన్న ఫేస్‌యాప్ విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అలాగే పర్మినెంట్ సిబ్బందితోపాటు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల రోజువారి పనికి సంబంధించిన హాజరు విధానంలో రాష్ట్రప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు చాలా ఇబ్బందిగా ఉన్నాయన్నారు. ఇందుకోసం తీసుకొచ్చిన జీవో 159ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కొత్త హాజరు విధానం ద్వారా ఎవరి సెల్‌ఫోన్‌లో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. కార్మికుల్లో అత్యధిక మందికి చదువే రాదన్నారు. అలాంటప్పుడు ఫొటోలు ఎలా అప్‌లోడ్ చేస్తారని ప్రశ్నించారు. కాగా కార్మికులందరికీ పనిముట్లు, రక్షణ పరికరాలు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని, సాధారణ మృతిచెందిన కార్మికుల కుటుంబానికి రూ. 2లక్షలు, ప్రమాదంలో మృతి చెందితే రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, పర్మినెంట్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు జిల్లా నాయకులు పైపల్లి గంగాధర్, వజ్రం నాగప్ప, పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, రిక్షా నర్సింహులు, తిప్పన్న, నరసింహులు, గజేంద్ర, శాంతమ్మ, గంగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి మకర తోరణం విరాళం


శ్రీవారికి బహూకరించిన మకరతోరణం

కదిరిటౌన్ : శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గర్భలాయ ముందు భాగాన సుమారు 50 కిలో వెండితో తయారు చేసిన మకర తోరణాన్ని బెంగళూరుకు చెందిన లక్ష్మమ్మ కుమారుడు మంజూనాథ్, కోడలు మహేశ్వరి కుటుంబ సభ్యులు శుక్రవారం విరాళం అందజేశారు. ఈమేరకు మకరతోరణాన్ని ప్రధాన అర్చకులు ఎవి.నరసింహచార్యులు, డి.పార్థసారథిచార్యులు, ఆలయ కమిటీ ఛైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణకు అప్పజెప్పారు. అనతరం దాతలకు శ్రీవారి, అమ్మవారి ఆలయములో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదమును అందజేశారు. అలాగే కదిరి కెనరా బ్యాంకు వారు ఆలయానికి పెద్ద ఎల్ఇడి స్రీన్ విరాళంగా అందజేశారు. ఈ కార్యాక్రమంలో కెనరా బ్యాంకు డివిజినల్ మేనేజర్ వై.వి.రాంప్రసాద్ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ సాయినాథ్‌రెడ్డి, రికవరీ మేనేజర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, కదిరి బ్రాంచ్ మేనేజర్ సిఎన్.మధుసుధన్ పాల్గొన్నారు.

తనకల్లులో సర్వసభ్య సమావేశం

తలుపుల : స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఉన్న జీవనజ్యోతి మండల సమైక్యలో ఎంపిపి మహమ్మద్ రఫీనాయక్ అధ్యక్షతన ఎంపిడిఒ రామానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కోలా లక్ష్మీదేవి తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ప్రగతి నివేదిక గురించి వివరించారు. అనంతరం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరైతే భూమిని సాగు చేసుకుంటున్నారో.. వారికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మహేష్‌రెడ్డి, డాక్టర్ మున్వర్‌బాషా, విద్యాధికారి వెంకట్రాముడు, హౌసింగ్ ఎఇ భార్గవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దీప, అగ్రికల్చర్ ఎఒ షాదబ్, వెలుగు ఎపిఎం బాబ్జీ, వెంకటమోహన్, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్లీనరీకి ఆంజనేయులుకు ఆహ్వానం




తనకల్లు : మండల పరిధిలోని మరాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జి.ఆంజనేయులుకు కాంగ్రెస్ పార్టీ త్వరలో నిర్వహించనున్న ప్లీనరీ సమావేశానికి ఆహ్వానం లభించింది. రాయపూర్‌లో జరగబోయే కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశాలకు అతి కొద్దిమందికి మాత్రమే అవకాశం కలుగుతుంది. వీరిలో చాలాకాలం తర్వాత కదిరి ప్రాంతం నుంచి ఆంజనేయులుకు ఎఐసిసి ఆహ్వానం పంపడం గర్వకారణమన్నారు.

20 నుంచి పోలీస్ ఈవెంట్స్

పుట్టపర్తి రూరల్ : శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం నుంచి పోలీస్ పరీక్షలకి (ఎస్ఐ, కానిస్టేబుల్) సన్నద్ధమవుతున్న అభ్యర్థులందరికీ నిష్ణాతులైన పోలీస్ సిబ్బందితో గ్రౌండ్ ప్రాక్టీస్ చేయించనున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాల పోలీసు అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరువు

కనగానపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈసందర్భంగా సర్పంచులు రామాంజనేయులు, మురళి, దాసిరెడ్డి మండలవ్యాప్తంగా నెలకొన్న కరెంటు కోతలపై విద్యుత్ అధికారులను నిలదీశారు. రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పంటలు సాగు చేస్తుంటే విద్యుత్ అధికారులు కోతలతో వారికి చుక్కలు చూపిస్తున్నారన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి అన్నారు. దీంతో రైతులు బోరుబావులు దగ్గరే ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామానికీ రోడ్డు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్నా నాయకులు, అధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, మాత శిశు సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం బుగ్గపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి జ్యోత్స్న బాలింతలు, గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్నిప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే 104 సేవలను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలన్నారు. కాగా ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. అంతేగాకుండా మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉండి సంతోషకరమైన జీవనం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణచ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ఆరోగ్య కార్యకర్త మంజులవాణి, అంగాన్‌వాడీ టీచర్ యశోద, ఆశా కార్యకర్తలు నిర్మల, మమతాజ్, హసీనా, పార్వతమ్మ, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ పాల్గొన్నారు.

ధర్మవరంలో పెరిగిన దౌర్జన్యాలు

ఇక నుంచి రోజూ అన్నదానం - మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ

ధర్మవరంలో రోజురోజుకూ అరాచకాలు, దౌర్జన్యాలు, కబ్జాలు పెరిగిపోయాయని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆరోపించారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయం వద్ద శుక్రవారం భోజన సౌకర్యాన్ని ప్రారంభించారు. ముందుగా పూజలు చేసిన అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలకు, కార్యకర్తలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాతో దేశమంతా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ముఖ్యంగా ధర్మవరంలో అరాచకాలు, దౌర్జన్యాలు, కబ్జాలు మితిమీరిపోయాయన్నారు. బాధిత ప్రజలకు అండగా ఉంటూ వారికి న్యాయం చేస్తానన్నారు. ఇకపోతే పట్టణానికి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం తన కార్యాలయం వద్ద రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత పట్టణంలోని దుర్గానగర్‌లో వెలసిన శీతలాదేవి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుదర్శన్‌రెడ్డి, చిగిచెర్ల అరవిందరెడ్డి, రాప్తాటి రాము, దుస్సా క్రిష్ణ, అంబటి బద్రీ, చిలకం సూర్యనారాయణరెడ్డి, బోడగల గిరిధర్, గొట్లూరు చంద్ర, కొండాశీన, బోయలపల్లి సుజాత, గంధమనేని నారాయణస్వామి పాల్గొన్నారు.

'పురం' మున్సిపల్ కార్యాలయానికి నూతన శోభ

ప్రజాశక్తి-హిందూపురం


కొత్తగా వేసిన ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

హిందూపురం ము న్సిపల్ కార్యాలయం నూతన శోభను సంతరించుకుంది. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.11లక్షలతో కార్యాలయంలోని హాల్‌లో ఉద్యోగులు, సిబ్బంది అధునాతనమైన ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ జనరల్ నిధులతో విజయవాడ నుంచి తెప్పించిన ఫర్నీచర్‌ను శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలోని రెవెన్యూ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, తదితర విభాగాల అధికారులు ఒకేచోట ఉండి ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో నూతన ఫర్నీచర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆగమికులు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస్‌కుమార్, అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం, ధ్వజారోహణం, అంకురార్పణం, హోమాలను నిర్వహించారు. తర్వాత శివపార్వతులను ఆలయం నుంచి భజనమందిరం వరకు స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శీనా స్వామి, సింహంస్వామి, దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

'యువగళం'కు అడ్డంకులు సృష్టించడం హేయమైన చర్య

ప్రజాశక్తి-తనకల్లు


విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిడిపి యువ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అడ్డంకులు సృష్టించడం హేయమైన చర్య అని టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సరోజమ్మ టైలరింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రను ఆపడానికి పోలీసులను అడ్డం పెట్టుకుని సిఎం జగన్ కుటీల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు అనుకుని ఉంటే గతంలో మీరు, మీ తండ్రి పాదయాత్ర చేసేవారా.. అని ప్రశ్నించారు. మీరు ఎన్ని కుయుక్తులు, కుట్రలు చేసినా పాదయాత్ర ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ శంకర్‌నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కుంచె నాగేంద్రప్రసాద్, మహబూబ్‌బాషా, సోంపాలెం నాగభూషణం, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పీజీ మల్లికార్జున, జరిపిటి రవి, దామోదర్, జియావుల పులి, మహేష్, తాజ్, ఎస్సీ సెల్ చిన్నప్ప, టిడిపి కార్యకర్తలు, నాయకులు యూత్ పాల్గొన్నారు.

మడకశిర : టిడిపి యువనాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో వైసిపి నేతల్లో గుబులు రేపుతోందని టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు వస్తున్న విశేష స్పందనను చూసి వైసిపి నాయకులు అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర విజయవంతం కావడంతోపాటు 2024 ఎన్నికల్లో తప్పకుండా టిడిపి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ పాండురంగప్ప, మాజీ ఎంపిపి ఆదినారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ప్రకాష్, కరియన్న, శ్రీనివాసులు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రోజా.. నోరు అదుపులో పెట్టుకో..

టిడిపి వడ్డెర సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నారా లోకేష్‌పై మంత్రి రోజాతో పాటు వైసిపి నాయకులు అవాకులు, చవాకులు వేస్తున్నారని నోరు అదుపులో పెట్టుకోవాలని లేని పక్షంలో త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని రాష్ట్ర వడ్డెర్ల సాధికారిక టిడిపి కన్వీనర్ వడ్డే వెంకట్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేష్ యువ గలం పేరుతో పాదయాత్ర చేస్తుంటే వైకాపా నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైకాపా నాయకుల అరాచకాలు, దౌర్జన్యాలకు హద్దే లేకుండా పోతుందన్నారు. లోకేష్ పాదయాత్రకు ప్రజాస్పందనను చూసి ఓర్వలేక మంత్రి రోజా ఆ పార్టీ నాయకులు పరుష పదజాలంతో తిట్టడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం అడుగడుగునా పాదయాత్రకు ఆటంకాలు సృష్టిస్తోందని, నాడు జగన్ పాదయాత్రకు టిడిపి ప్రభుత్వం ఆంక్షలు, అడ్డంకులు ఏనాడు కల్పించలేదని గుర్తు చేశారు. ఇలాగే వాగే వైకాపా నాయకులను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

టిడిపి నాయకురాలు సవితమ్మ

ప్రజాశక్తి-పెనుకొండ


అన్నదానం చేస్తున్న టిడిపి నాయకురాలు సవితమ్మ

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సవితమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటిన్‌లో రూ.5కే రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో నిరంతరాయంగా నాణ్యమైన భోజనం అందిస్తానన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని వారికి నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, పెనుకొండ మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రెడ్‌క్రాస్ సొసైటీ, ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా శుక్రవారం అనాథ పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. పుట్టపర్తిలోని హ్యాపీ హోమ్‌లో ఉన్న 22 మంది చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. అలాగే మునిసిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లిలోని హోలీ సిటీ చర్చి ఆధ్వర్యంలో నడుస్తున్న హోమ్‌లో 18 పిల్లలకు కంటి పరీక్షలు చేసి ఒకరికి కంటి అద్దాల అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఇదేక్రమంలో ప్రేమ ధర్మ ఛారిటబుల్ ట్రస్టు హోంలో ఐదుగురు పిల్లలకు పరీక్ష నిర్వహించగా ఇద్దరికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ రమేష్, ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి నిపుణులు , హ్యాపీ హోం నిర్వాహకులు రంజితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల కేంద్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆర్డీటీ నిర్మించిన కొత్త భవనాల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కేంద్రాల్లో గాలి, వెలుతురు, విద్యుత్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామ్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ హనుమంతు, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు

భగత్‌సింగ్ ఆటోస్టాండ్ ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఎఆర్ ఆసుపత్రి వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ ఆటో యూనియన్ స్టాండ్‌ను సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఐ తాలూకా సహాయ కార్యదర్శి శివప్ప, కృష్ణ, ఎఐటియుసి పట్టణ అధ్యక్షులు జబివుల్లా, పట్టణ కార్యదర్శి మారుతి రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చలపతి, చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం


పరామర్శిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బికె

అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని చోలేమర్రి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి ఉప్పర కుళ్లాయప్పను టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న బికె.పార్థసారథి, అల్లుడు శశి భూషణ్ కలిసి కుళ్లాయప్ప ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ నరహరి, మాజీ ఎంపిపి చలపతి, సర్పంచి జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుత్రిలో శుక్రవారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రోగులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆశీస్సులతో పట్టణానికి చెందిన జింకా రాజేంద్రప్రసాద్, బళ్లారి ఆదినారాయణ, గవ్వల ఆదినారాయణలు సహకారంతో 385 మందికి భోజన ప్యాకెట్లను అందజేసినట్లు సత్యసాయి సేవాసమితి సభ్యులు తెలిపారు. అదేవిధంగా గర్భిణిలు, బాలింతలకు స్వీట్లు పంపిణీ చేశారు.

నేరాలు ఘోరాలు

యువకుడు దారుణహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ముస్లిం శ్మశాన వాటికలో పరమేశ్వరాపురం గ్రామానికి చెందిన కుమ్మరి మోపిరి (23) దారుణహత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రెండు రోజుల క్రితమే హత్య జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో గురుస్వామి మృతి


రాజగోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

బత్తలపల్లి : తెల్లవారితే శ్రీశైలం మల్లికార్జునస్వామికి ఇరుముడితో వెళ్లాల్సిన గురుస్వామి రాజగోపాల్‌రెడ్డి (88) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన కాటికోటేశ్వరక్షేత్రం ఆలయ ధర్మకర్త, వాటర్‌షెడ్ మాజీ ప్రెసిడెంట్, వైసిపి నాయకులు రాజగోపాల్‌రెడ్డి ప్రతిఏటా మాఘమాసంలో శివదీక్ష తీసుకుని ఇరుముడి కట్టుకుని శ్రీశైలం బయలుదేరి వెళ్తారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి ఆలయంలో భజనలు, పూజలు చేసిన అనంతరం భక్తులు అన్నదానం చేశారు. అనంతరం నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో ఒక్కసారిగి గుండెల్లో నొప్పి వచ్చింది. వెంటనే తోటి స్వాములు కారులో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు, శివమాలధారులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా విషయం తెలుసుకున్న ప్రజలు, నాయకులు, మాలధారులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్లు ముష్టూరు నరసింహారెడ్డి, గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు బోయ సాంబ, శాలివాహన సంఘం నాయకులు వక్కల శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

మూర్ఛతో గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తేరుబజారులో గుర్తుతెలియని వ్యక్తి మూర్ఛ వచ్చి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికుల సాయంతో పోలీసులు తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు గుర్తుతెలియని వ్యక్తికి వైద్య చికిత్సలు చేశారు. అయితే గుర్తుతెలియని వ్యక్తి ఎవరో తెలియదని ఎవరికైన తెలిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

టిడిపి నాయకుని తల్లి మృతికి సంతాపం

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని బాలేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు సత్యనారాయణ తల్లి అనారోగ్యంతో మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే ఈరన్న శుక్రవారం నివాళుర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి జయరామ్‌రెడ్డి, సత్యనారాయణ, రమేష్, సిద్ధప్ప, నరసింహప్ప, మాజీ ఎంపీటీసీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

హిందూపురం : పట్టణంలోని మేళాపురం సర్కిల్ సమీపంలో మూడు రోజుల క్రితం మృతిచెందిన అనాథ శవానికి ఆల్ ఇందాద్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువకులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు ఎండిఎస్ అమన్ మాట్లాడుతూ పట్టణ వ్యాప్తంగా అనాథ శవాలు ఎక్కడ ఉన్నా తమకు సమాచారం అందిస్తే వారి సంప్రదాయ ప్రకారం అంతక్రియలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఆపదలో ఎవరు ఉన్నా తమకు సమాచారం అందిస్తే ట్రస్ట్ తరపున వారికి సహాయక చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ఉమర్ ఫరూఖ్, జాయింట్ సెక్రటరీ ఉస్మాన్, మెంబెర్స్ వివేక్, హర్షద్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్‌పై దాడి

మడకశిర రూరల్ : మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామంలో ఉన్న మల్బరీ తోటలోకి ఓ గేదె పోయిందనే కారణంతో శివరంగేగౌడ్ మరో వ్యక్తితో కలిసి గ్రామ వాలంటీర్ కిషోర్‌బాబుపై శుక్రవారం కొడవలితో దాడి చేసినట్లు వైసిపి నాయకులు తెలిపారు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హిందూపురం తరలించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు హనుమంతరావు, మైలారప్ప, జయరాజు, జమ్మనపల్లి మూర్తి, రామలింగప్ప, బుడ్డప్ప మాట్లాడుతూ వాలంటీర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఖురాన్ పోటీ విజేతలకు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విజయవాడలో ఈనెల 12న ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖురాన్ కంఠస్థ పోటీల్లో బి-గ్రూపులో విజేతలుగా నిలిచిన మహమ్మద్, జైదక్కు రైహాన్‌ను శుక్రవారం స్థానిక జామియా మసీదులో వైస్ ముతవల్లి డాక్టర్ వలీసాబ్, కార్యదర్శి హైదరలీ ఘనంగా సన్మానించారు. ఖురాన్ కంఠస్థ రాష్ట్రస్థాయి పోటీల్లో మహమ్మద్ రైహాన్ బి-గ్రూపులో మొదటిస్థానం, అలాగే సీ-గ్రూపులో వెళ్లిన మరో విద్యార్థి ఎండీ.జైక్లను సన్మానించారు. అదేవిధంగా రెహాన్కు రూ.20వేలు చెక్కును అందజేశారు. అనంతరం వీరిని మతపెద్దలు అభినందించారు.

టిడిపి ఆర్‌టిఎస్ కోఆర్డినేటర్ల నియామకం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లావ్యాప్తంగా టిడిపి ఆర్‌టిఎస్ (రియల్ టైం స్ట్రాటజీ) నియోజకవర్గ కోఆర్డినేటర్లుగా నియమించినట్లు ఆర్‌టిఎస్ జిల్లా ఇన్‌ఛార్జి బండారు మనోహర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా బి.సురేష్‌నాయుడు, పెనుకొండకు నరేష్‌కుమార్, మడకశిరకు రామకృష్ణ, రామయ్య, రాప్తాడుకు పరిమళ, హిందూపురం, ధర్మవరానికి అప్పస్వామి, కదిరికి దండే గంగ శేఖర్‌ను నియమించినట్లు తెలిపారు. కోఆర్డినేటర్లు పార్టీ విధి విధానాలతోపాటు అధికార పార్టీ అసమర్థపాలనను గురించి ఎప్పటికప్పుడు కార్యకర్తలకు వివరిస్తూ ఉండలన్నారు.

మిషన్ అంత్యోదయపై వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ఎంపిడిఒ కార్యాలయంలో మిషన్ అంత్యోదయ కార్యక్రమంపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ సీఈవో భాస్కర్‌రెడ్డి, అనంతపురం డిపిఒ ప్రభాకర్‌రావు, డిఆర్‌డివి పీడీ నరసింహారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మండల, గ్రామ స్థాయి అధికారులకు సలహాలు, సూచనలు అందజేశారు. ముఖ్యంగా గ్రామాల్లోని మౌలిక సదుపాయాలు, అంగన్‌వాడీలు, పాఠశాలల్లో నీటి సదుపాయాలు, మరుగుదొడ్ల సౌకర్యం, గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల వివరాలు, మొదలైన అంశాలపై సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ, సచివాలయ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల పూర్తవుతున్నా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని టిడిపి సీనియర్ నాయకులు, జడ్పీ మాజీ ఛైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి విమర్శించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు. కావున రానున్న రోజుల్లో టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి విజయసారథి, మాజీ కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు చిగిచర్ల రాఘవరెడ్డి, టిఎన్‌టియుసి నియోజకవర్గ అధ్యక్షులు రేగాటిపల్లి నాగేంద్రరెడ్డి, చిగిచెర్ల ఆది, జనార్ధన్, నాగానంద, నాగులూరు లింగప్ప, రాము, పెద్ద చెక్కరయ్య, రమేష్, ఎస్సీసెల్ ఆదినారాయణ, మల్లేనిపల్లి చంద్ర, బిల్లే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ'లో టిడిపి నాయకులు


రామగిరిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టిడిపి నాయకులు

రామగిరి : మండల పరిధిలోని నసనకోట పంచాయతీ కొత్తగేరి గ్రామంలో శుక్రవారం ఇదేం ఖర్మ మా కొత్తగేరి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి గ్రామంలోని సమస్యలతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సిమెంటు రోడ్డు, వాటర్‌ప్లాంట్, బస్టాండ్ ఆధునీకరణ, ప్రధానమైన రోడ్లు వేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో స్థానిక బస్టాండ్ సమీపంలో తాగునీటి పైపులు ధ్వంసమై సంవత్సరం అయినా పట్టించుకోలేదన్నారు. అలాగు గ్రామంలో ఆర్డీటీ సహకారంతో 24 ఇళ్లు నిర్మిస్తుంటే ఇసుక కొరత వేధిస్తోందన్నారు. ట్రాక్టర్ ఇసుక సుమారు రూ.4,500 వెచ్చించి తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అలాగే నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కావున రానున్న రోజుల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును సిఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ఎల్.శ్రీధర్‌నాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి పోతన్న, బూత్ కన్వీనర్ శివానంద, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లింగమయ్య, మల్లరాయుడు, ముత్యాలంపల్లి నాయకులు సురేష్, కాంతస్వామి, డిముత్యాలు, పోతన్న, ఓబుళపతి, కటిక మల్లన్న, స్థానిక నాయకులు రమణయ్య, నల్లప్ప, ఎస్.ముత్యాలు, చెరుకూరి రవి, కొడిదల సుబ్బారావు, శంకర జైచంద్ర, అదెప్ప, మురళీ, తదితరులు పాల్గొన్నారు.